


# ఇంటినిండా ఇంగిలీషు

**మా** నాన్నగారింట్లో వాళ్ళకి ముఖ్యంగా ఆడవాళ్ళకి మా అమ్మవైపువాళ్ళంటే కాస్తంత చులకన. పల్లెటూరివాళ్ళనీ చాదస్తంగాఉంటారనీ ఎగతాళి చేసేవాళ్ళు. వాళ్ళు కూడా 'ఓయబ్బో! ఆ పట్నం షోకులు చూసితీరాల్సిందే' అని ఆక్షేపణ చేసేవాళ్ళు.

ఓసారి మా అమ్మమ్మ గుంటూరు వచ్చింది. మా నాయనమ్మ పౌడర్లూ, సబ్బులూ వాడేది. 'ఆ వయసులో ఏమిటో ఆ ముస్తాబులు' అని ఎగతాళిచేసేది అమ్మమ్మ. పైకి ఎగతాళిచేసినా ఆ పౌడరు రాసుకోవాలని ఆవిడకీ కోరికగానే ఉండేది కాబోలు. ఎవర్నైనా అడిగితే ఏం ఎగతాళి చేస్తారో అనుకుందేమో, ఓరోజు గుట్టుచప్పుడు కాకుండా ఇంత పౌడరు తీసుకుని మొహానికి రాసుకుంది. పాపం, కాసేపటికి మొహం అంతా మంటలూ, దురదలూనట.

'ఛ! ఎలా రాసుకుంటారో బాబూ ఆ దిక్కుమాలిన పొహడర్లు? తాట లేచిపోయినంత పనయింది' అని వాపోయింది నా దగ్గర. ఆవిడ రాసుకున్న పౌడరేమిటా అని చూద్దును కదా... టూత్‌పౌడర్! జాలీ, నవ్వూ ఒకేసారి కలిగాయి నాకు. టాల్కమ్ పౌడరు ఇస్తానన్నా ససేమిరా వద్దన్నది. ఈ విషయం ఎంత దాచాలనిచూసినా బయటకు పొక్కి అందరూ నవ్వుకున్నారు.

కొంతకాలానికి మళ్ళీ గుంటూరు ప్రయాణం వచ్చింది అమ్మమ్మకి. నన్ను పిలిచి "అమ్మడూ! అక్కడవాళ్ళంతా ఇంగిలీషు ముక్కలు మాట్లాడతారు. నాక్కూడా నాలుగు ముక్కలు నేర్పావంటే నేనూ దడదడలాడిస్తాను" అంది. "ఓ! దానికేం భాగ్యం" అన్నాను.

'దాన్నేం అంటారు' 'దీన్నేం అంటారు' అని అడిగి ఓ పది మాటలు నేర్చుకుంది. బాగానే బట్టీ పట్టింది.

ఊరుకెళ్ళాం. వాకిట్లోనే ఎదురొచ్చి పలకరించారు అందరూ.

"ఏం వదినా! కులాసాగా ఉన్నావా?" అంది మా నాయనమ్మ.

"ఏం కులాసానో ఏం పాడో. ఈ మధ్య ఒంట్లో బావుండడం లేదు. తల పేను" అంది అమ్మమ్మ.

"అదేవిటి వదినా! నువ్వు చాలా శుభ్రంగా ఉంటావు. నీకు పేలు పడ్డాయా?" అని అడిగింది ఆశ్చర్యంగా నాన్నమ్మ.

"ఛఛ. పేలు కాదు, పేను. ఇంగిలీషులో పేను అంటే నొప్పి" అంది అమ్మమ్మ గర్వంగా.

"ఓహో అదా! నిజమే మరి. వయసు మీదపడుతోందిగా. నాకూ ఈ మధ్య బావుండటం లేదు. బాగా ఈకుగా ఉంటోంది" అంది నాన్నమ్మ.

"ఈకు ఏవిటి వదినా?" అంది అమ్మమ్మ.

"ఈకు అంటే ఇంగిలీషులో బలహీనంలే వదినా!" అంటూ బదులుచెప్పింది నాన్నమ్మ.

ఇద్దరూ సాధ్యమైనంతగా ఇంగిలీషులోనే మాట్లాడుకున్నారు. సాయంత్రం పనిమనిషి ఆదెమ్మ వచ్చింది.

అమ్మమ్మని చూసి సంతోషంగా పలకరించింది.

'బావున్నావుటే ఆదెమ్మా' అని యోగక్షేమాలు విచారించి "ఏమాటకామాటే చెప్పుకోవాలి– పట్నంలో ఉన్నా నువ్వు చాలా బోడెంటు. ఎన్నేళ్ళనుంచి ఇక్కడ పనిచేస్తున్నారు మీరు...మా అమ్మాయి పెళ్ళయిన దగ్గర్నించి మీరేగా. మీ అక్కయ్య, మీ అమ్మ అందరూ బోడెంటులే" అంది అమ్మమ్మ.

ఆదెమ్మ వెంటనే వెళ్ళి మా నాన్నమ్మ దగ్గర మొరపెట్టుకుంది. "మీ వీపరాలుగారు నన్ను 'బోడి' అన్నదమ్మా. నన్నంటే సరే. మా అక్కనూ, అమ్మనూ కూడా బోడి అన్నది" అని కళ్ళనీళ్ళు పెట్టుకుందిట.

మా నాయనమ్మకు కాస్త కోపం వచ్చింది. అమ్మమ్మ దగ్గరకు వచ్చి "ఏం వదినా! పాపం, తరతరాలుగా మా ఇంట్లో విశ్వాసంగా పనిచేస్తున్నారు వాళ్ళు. దాన్ని పట్టుకుని బోడీ అన్నావుట. అది ఏడుస్తోంది" అంది.

అమ్మమ్మ "అయ్యో రామా! నేను బోడీ అని ఎక్కడన్నాను వదినా? బోడెంటు అన్నాను" అంది.

"సరే పోనీ. ఆ బోడెంటు అనైనా ఎందుకన్నావు? అదేం చేసిందని, అంతలేసి మాటలనడం చెప్పు" అన్నది నాయనమ్మ నిష్ఠూరంగా.

"నేనేం మాటలు అన్లేదమ్మా. బాగా విశ్వాసంగా ఉంటావు అని ఇంగిలీషులో అన్నాను. పుణ్యానికిపోతే పాపం ఎదురైంది అన్నట్లుగా ఉంది" అంది అమ్మమ్మ.

"ఎంత ఇంగిలీషులో అయితే మాత్రం విశ్వాసాన్ని బోడెంటు అంటారా?" అంది నాయనమ్మ.

"అయితే ఏవంటారో నువ్వే చెప్పు. నాకు నా మనవరాలు నేర్పింది. విశ్వాసం అంటే బోడెంటేనుట. పనివాళ్ళని నువ్వు చాలా బోడెంటు అని మెచ్చుకుంటే వాళ్ళు సంతోషిస్తారు అని కూడా చెప్పింది. మరి మీకెవ్వరికీ ఇంగిలీషు రాకపోతే నేనేంజేస్తాను?" అంది సమర్థించుకుంటూ.

ఇంతలో తాతయ్యగారు అటు వచ్చారు. "ఏమిటి గొడవ?" అని అడిగారు. ఇద్దరూ వంతులేసుకుని చెప్పేశారు.

'ఇట్రా' అని నన్ను పిలిచారు. 'ఏవిటిదంతా' అని అడిగారు.

'పనివాళ్ళతో మంచిగా ఓ మాట ఇంగిలీషులో అంటాను, ఏమనాలో చెప్పు' అని అడిగింది అమ్మమ్మ. 'నువ్వు చాలా ఒబీడియెంట్ అనమని చెప్పాను. మరావిడకి నోరు తిరక్క బోడెంటు అంటే నేనేం చెయ్యను అని చెప్పుకున్నాను.

వాళ్ళిద్దరికీ ఏదో చెప్పి సర్దుబాటు చేసి నన్ను దగ్గరకి పిలిచారు తాతయ్య. "ఏదో సరదాకి అడిగిందే అనుకో-వాటరు, మిల్కులాంటి చిన్నపదాలు నేర్పాలి గానీ అంతంత పెద్దమాటలు నేర్పితే దానికి నోరు తిరగద్దూ? అందులోనూ ఒబీడియెంటెంటూ ఇండిపెండెంటెంటూ మొదలైన మాటలున్నాయే అవి నాలాటి మేధావులకే తికమకగా ఉంటాయి. ఇక మీ అమ్మమ్మ ఏం పలుకుతుంది" అన్నారు కాస్త గర్వంగా.

* * *